క్లుప్తంగా

మక్తల్ వాసికి డాక్టరేట్



మక్తల్: మండల కేంద్రానికి చెందిన కర్ని అరవింద్ హైదరాబాద్‌లోని వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. పరిశోధన థీసిస్‌ను పీజేఏయూ పాథాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ సుధాకర్, శాంతలక్ష్మిప్రసాద్‌కు శుక్రవారం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అరవింద్‌ను పలువురు అభినందించారు.

గ్యాస్ సిలిండర్, స్టవ్ వితరణ



మక్తల్: మండలంలోని రుద్రసముద్రం ప్రాథమికోన్నత పాఠశాలకు స్థానిక హెచ్‌ఎం హేమలత సొంత ఖర్చులతో గ్యాస్ సిలిండర్, స్టవ్ అందజేశారు. మధ్యాహ్న భోజన సిబ్బంది కట్టెల పొయ్యితో ఇబ్బందులు పడుతుండగా హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన హెచ్‌ఎం శుక్రవారం గ్యాస్ సిలిండర్, స్టవ్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ప్రహ్లాద్‌కుమార్, ఆంజనేయులు, మంజులత, వరుణ్, ప్రమీలత , దివ్యజ్యోతి, రిహానా బేగం , అంజమ్మ, నర్సింలు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



పాన్‌గల్: వ్యవసాయ అధికారుల సూచనల మేరకే రైతులు మందులను పిచికారీ చేయాలని మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రాయినిపల్లి, మాందాపూర్ గ్రామాల్లో వరి పంటలకు ఆశించిన తెగుళ్లను పరిశీలించారు. వాటి నియంత్రణకు రైతులు వాడాల్సిన మందుల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవసాయ యాంత్రీకరణ వినియోగం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వరి పంటలకు ఎక్కువగా అగ్గి తెగులు ఆశిస్తుందని వాటి నివారణకు వాడాల్సిన మందులను రైతులకు సూచించారు. డ్రోన్ ద్వారా మందుల పిచికారీని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏఈఓ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

వరి పంటకు కాండం కుళ్లు తెగులు

అమరచింత: మండలంలో యాసంగిలో సాగు చేసిన వరి పంటకు కాండం కుళ్లు తెగులు సోకిందని, అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి అరవింద్ కోరారు. మండలంలోని నందిమళ్లలో శుక్రవారం చంద్రశేఖర్ రెడ్డి అనే రైతు సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ జింక్, నత్రజని, పోషక లోపాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీటి వల న పంట పెరగకుండా చివరి ఆకులు ఎండిపోయి, ఆకుల మీద నల్లటి శిలీంద్రాలు ఉండి కాండం కింది భాగంలో వేర్లు కుళ్లి చనిపోతుందన్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి వారు సూచించిన మందులనే వాడాలని సూచించారు.

వీరాంజనేయస్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ వేడుకలు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని పాతబజార్ వీరాంజనేయస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు శుక్రవారం ప్రముఖ వేద పండితులు జోషి ప్రశాంత్‌శర్మ నేతృత్వంలో ప్రారంభమయ్యాయి. 400 ఏళ్ల క్రితం సంస్థానాధీశుల కంటే పూర్వం నాటి వీరాంజనేయ ఆలయం వనపర్తిలో చేపట్టిన రోడ్ల విస్తరణలో తొలగించడంతో పునః ప్రతిష్ఠ మహోత్సం ఆగమశాస్త్ర ప్రకారం వేదపండితులు చేపడుతున్నారు. తొలిరోజు గణపతి పూజ, హోమాన్ని వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య చేపట్టి రక్షాబంధనంతో అఖండ దీపస్థాపనకు అంకురార్పణ చేశారు. పంచద్రవ్య మేళనంతో నూతన ఆలయాన్ని ప్రోక్షణం చేసి, దీక్షాధారణ, సర్వతోభద్ర మండలం, యోగిని మండలం, వాస్తు మండలం, క్షేత్రపాలన పూజ, నవగ్రహ మండల దేవతా ఆవాహనం క్రతులను పండితులు జరిపించారు.



పెరిగిన పనిభారంతో అవస్థలు



మాగనూర్‌లో ప్రజాపాలన సర్వే నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు(ఫైల్)

- మానసిక ఒత్తిడి అంటున్న కార్యదర్శులు
- ప్రజాపాలన పనులు, సర్వేల పర్యవేక్షణ
- అదనంగా ఉపాధి పనులు

మాగనూర్: గ్రామస్థాయిలో ప్రజాపాలన పనులను నిత్యం పర్యవేక్షించే పంచాయితీ కార్యదర్శులు అదనపు పనిభారంతో ఇబ్బందులు పడుతున్నారు. కార్యదర్శులు, జీపీ పాలకవర్గంతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థాయిలో అమలుపర్చడం, పర్యవేక్షణ చేస్తుంటారు. కానీ ఇటీవల కార్యదర్శులకు వివిధ విభాగాల పర్యవేక్షణ పనులను ప్రభుత్వం అదనంగా కేటాయించడంతో, తమకు తలకు మించిన భారం అవుతుందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

12 మంది కార్యదర్శులు..

మండలంలో 16 గ్రామ పంచాయితీలు ఉండగా మొత్తం 12 పంచాయితీలకు ప్రభుత్వం కార్యదర్శులను నియమించింది. నాలుగు గ్రామాలకు కార్యదర్శులు లేకపోవడంతో మిగిలిన నాలుగింటికి ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. ముఖ్యంగా కార్యదర్శులు తాము పనిచేసే ప్రదేశానికి 4 కిలోమీటర్ల పరిధిలో ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీనికి తోడు ప్రత్యేక యాప్‌ను ఏర్పాటు చేసింది. దీంతో పంచాయితీ కార్యాలయం ఎదుట ఉదయం 7 గంటల నుంచి 8 గంటల్లోపు కార్యదర్శులు హాజరై, యాప్‌లో హాజరు నమోదు చేయాలి. సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయంలో ఉండాల్సి వస్తుంది. ఈ విషయంలో ముఖ్యంగా మహిళా పంచాయతీ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి పనులు పూర్తి చేసుకొని ఉదయమే కార్యాలయానికి రావడం కష్టమవుతుందని వాపోతున్నారు.

అదనపు పనులతో భారం..

కార్యదర్శులకు సాధారణ విధులతో పాటు జాతీయ ఉపాధిహామీ పథకం పనుల పర్యవేక్షణను ప్రభుత్వం అప్పగించింది. దీనికి తోడు ఇంటి పన్నుల వసూళ్లు, కూలీల పనుల పరిశీలన తమకు తలకు మించిన భారం అవుతుందని కార్యదర్శులు వాపోతున్నారు. జూనియర్ మహిళా పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం ఇచ్చే ప్రసూతి సెలవులు ఆరు నెలలు వర్తించడం లేదు. ప్రభుత్వం నాలుగేళ్ల ప్రొబేషన్ పీరియడ్ పెట్టడంతో వీరికి నాలుగు నెలల ప్రసూతి సెలవులను వర్తింపజేస్తున్నారు. దీంతో చిన్న పిల్లలతో మహిళ కార్యదర్శులకు విధులకు హాజరు కావాల్సి వస్తోంది. ఈ విషయంలో ప్రభుత్వం పనిభారం తగ్గించేలా చూడాలని కార్యదర్శులు కోరుతున్నారు.



గ్రామంలో పనులు చేయిస్తున్న పంచాయితీ కార్యదర్శి (ఫైల్)

ప్రతి సర్వేకు కార్యదర్శినే..

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రవేశపెడుతున్న ప్రతి పథకానికి పర్యవేక్షణ బాధ్యత గ్రామ పంచాయతీ కార్యదర్శినే పెడుతున్నారు. కావునా గ్రామ పంచాయతీ సొంత విధుల నిర్వహణకు తీవ్ర ఆటంకాలు కలుగుతున్నాయి. ఇన్ని విధులు నిర్వహించిన గ్రామ పంచాయతీలో నిధులు లేక సొంత ఖర్చులతో గ్రామ పంచాయతీ బాధ్యతలు నెట్టుకొస్తున్నారు. ముఖ్యంగా సర్పంచ్‌లు లేకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పనుల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆలోచించి తమపై పని భారం తగించడంతో పాటుగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి కావాల్సిన నిధులను విడుదల చేయాలని కోరుతున్నారు.

పనిభారం తగ్గించాలి..



పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం పని భారం తగ్గించాలి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులను నిర్వహిస్తున్నాం. దీనికి తోడు ప్రజాపాలన పనులు, ఉపాధిహామీ పనులు చేస్తున్నాం. ప్రభుత్వం కార్యదర్శులకు ఈ విషయంలో సహాయకులను నియమించాలి.

– నర్సింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, కోత్తపల్లి

ఉపాధి పనుల పర్యవేక్షణతో ఇబ్బంది..



ఉపాధిహామీ పనుల క్షేత్ర స్థాయి పర్యవేక్షణతో ఇబ్బందులు పడుతున్నాం. మొబైల్ యాప్ ద్వారా ప్రతిరోజు హాజరు నమోదు చేస్తున్నాం. ఉపాధి పనులకు తోడు వందశాతం పన్ను వసూలు లక్ష్యంగా గ్రామంలో తిరగాల్సి వస్తోంది. ఇప్పుడు ప్రజా పాలనలో భాగంగా ప్రతి సర్వేకు తమకు పర్యవేక్షణ బాధ్యత అప్పగించడంతో అధిక పని భారం వల్ల మానసిక ఒత్తిడికి గురవుతున్నాం.

– తిమ్మప్ప, పంచాయితీ కార్యదర్శి, మాగనూర్

పని భారం తగ్గిస్తాం..



గ్రామపంచాయతీల్లో నిధులు లేక కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వం నిర్దేశించిన అన్ని అభివృద్ధి పనుల్లో భాగస్వాములుగా ఉన్నారు. మండలంలో పంచాయతీ కార్యదర్శులకు పని భారం తగించే ప్రయత్నం చేస్తాం.

– రహ్మతుద్దీన్ ఎంపీడీఓ, మాగనూర్

‘పేటకు’ తరలిన కాంగ్రెస్ శ్రేణులు



మక్తల్ నుంచి సీఎం బహిరంగ సభకు వెళ్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నారాయణపేట రూరల్/నర్వ/ ఊట్కూరు/మక్తల్/మరికల్: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి శంకుస్థాపన, ప్రారంభోత్సవానికి వస్తున్న నేపథ్యంలో అప్పక్‌పల్లి దగ్గర ఏర్పాటు చేసిన బహిరంగ సభకు మక్తల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి జెండా ఊపి నాయకులతో కలిసి తరలివెళ్లారు. బహిరంగ సభకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసి మహిళా సంఘాల గ్రూపు లీడర్లు తరలారు. ఈ సందర్భంగా మక్తల్‌లో షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ పావని తదితరులు తరలివెళ్లారు.

- జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు నర్వ మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లాయి. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, శరణప్ప, రవీందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, లంకాల్ కుర్వ మహేష్, వెంకటేష్, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.
- జిల్లా కేంద్రంలోని సీఎం బహిరంగ సభకు ఊట్కూరు పులిమామిడి, నిడుగుర్తి, పగిమారి తదితర గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక బస్సులో తరలి వెళ్లారు. యువజన సంఘం మండల అధ్యక్షుడు గోదాం మహేష్ ఆధ్వర్యంలో యువకులు భారీగా బైక్‌ర్యాలీతో బహిరంగ సభకు చేరుకున్నారు.
- జిల్లా కేంద్రానికి సమీపంలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు నారాయణపేట మండలం నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు ప్రజలు, మహిళలను ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో సభకు తరలించారు.
- జిల్లా కేంద్రం సమీపంలోని సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు మరికల్ నుంచి ఎయ్యి బైక్‌లతో ర్యాలీతో కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో సూర్యమోహన్‌రెడ్డి, వీరన్న, హరీష్, రామకృష్ణ, సత్యన్న, రఘు, ఆంజనేయులు, రామకృష్ణారెడ్డి, చిన్నబాలు, రవి పాల్గొన్నారు.



పాతర్చేడ్ నుంచి సీఎం సభకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

పోలీసులపై చర్యలు తీసుకోవాలి



ఎల్లప్పను పరామర్శిస్తున్న బీసీ సంఘం నాయకులు

కొత్తపల్లి: మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన కావలి ఎల్లప్పను నియోజకవర్గ బీసీ సంఘం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా కొడంగల్ తాలుకా ముదరాజ్ సంఘ నాయకులు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీసీల ఓట్ల వల్లే గెలుపొందిన నాయకులు మాపైనే దాడి చేయించడం బాధాకరమని వాపోయారు. కారణం లేకుండా ఎల్లప్పపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనియెడల మండల స్థాయి నుంచి తాలుకా స్థాయి వరకు నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నారాయణ, గోపాల్, జనార్ధన్, నెల్లి రాములు, తలారి సాయిలు, బీంశేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి



ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులతో నాయకులు

దామరగిద్ద: ప్రతి ఒక్కరు ఆత్మరక్షణకు కరాటే శిక్షణ ఎంతో అవసరమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, విండో అధ్యక్షుడు ఈదప్ప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కరాటే అకాడమీలో మాస్టర్ నర్సింహారాజుతో శిక్షణ పొందిన చిన్నారులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. కరాటే ప్రాధాన్యత వివరించి కరాటే మాస్టర్‌ను, చిన్నారులను అభినందించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కన్కిరెడ్డి, శ్రీనివాస్, జీఎచ్‌ఎం అశోక్‌కుమార్, ఆనంద్, ఉపాధ్యాయులు శంభులింగం, తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు వినతిపత్రం అందజేసిన ఎంపీ



సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ డీకే అరుణ

నారాయణపేట రూరల్: నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి శుక్రవారం ఎంపీ డీకే అరుణ వినతిపత్రం అందజేశారు. జీవో 69 అమలులో భాగంగా భూనిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, మెడికల్ కళాశాలకు పూర్తిస్థాయి సిబ్బంది కేటాయించాలని, నారాయణపేటలో మహిళా డిగ్రీ, పీజీ, ఐటీఐ కళాశాల, మక్తల్‌లో పాలిటెక్నిక్ కళాశాల, మరికల్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేయాలన్నారు. ఇటీవల నూతనంగా మంజూరైన నవోదయ పాఠశాలను గండీడ్‌లో కాకుండా మహబూబ్‌నగర్ సమీపంలో ఏర్పాటు చేయాలన్నారు. కోటకొండ, గార్లపాడు నూతన మండలాలుగా ప్రకటించాలని, భూనేడులో పోలీస్ స్టేషన్ ఏర్పాటు, జిల్లా కేంద్రంలో డ్రైనేజీ, తాగునీటి సమస్య పరిష్కరించాలని, చేనేత రంగానికి చేయూతను అందించాలని విజ్ఞప్తి చేసినట్లు ఎంపీ పేర్కొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



మక్తల్: కృష్ణ మండలం ముడుమాల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. తెలుగు భాషలో రచించిన కావ్యాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు చదివి వినిపించారు. విద్యార్థులు మాతృభాషను తప్పకుండా నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దండు శేఖర్, ఉపాధ్యాయులు భారతి, దిందప్ప, జ్యోతి, శ్రావణి, సోఫీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ధన్వాడలో ఉపాధ్యాయులుగా విద్యార్థులు


ధన్వాడ/కొత్తపల్లి/ మరికల్: ధన్వాడ మండల కేంద్రంలో సంతబజార్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- కొత్తపల్లి మండల పరిధిలోని భూనీడు జ్ఞానజ్యోతి విద్యాలయంలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి బోధించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- మరికల్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఘనంగా స్వపరి పాలన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. చక్కగా బోధన చేసిన విద్యార్థులను హెచ్‌ఎం రాంరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యలక్ష్మి, సంతోష, చైతన్య, చంద్రశేఖర్, ప్రవీణ్, శివకుమార్, అరుణ పాల్గొన్నారు.

సీఎం పర్యటన నిరాశే మిగిల్చింది

నారాయణపేట టౌన్: సీఎం రేవంత్ రెడ్డి పర్యటన జిల్లా ప్రజలకు నిరాశే మిగిల్చిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామారెడ్డి అన్నారు. శుక్రవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలకు సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కేంద్ర సమీపంలో నిర్వహించిన బహిరంగ సభ నేపథ్యంలో సీపీఎం నాయకులు సీపీఎం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో కొనసాగుతున్న నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం ఎంతో ప్రాముఖ్యమైన అంశమని, పనుల్లో భాగంగా భూములను కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టానికి అనుగుణంగా రైతులకు పరిహారం అందించాలన్న విషయాన్ని సీఎం ప్రస్తావించక పోవడం రైతుల్లో ఆందోళన కలిగించేలా ఉందన్నారు. కొన్నేళ్లుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇచ్చే విషయం ప్రస్తావించలేదన్నారు. జిల్లాలో కొన్నేళ్లుగా ఊరిస్తున్న కోటకొండ, గార్లపాడు, కానుకుర్తి నూతన మండలాల ఏర్పాటు, మక్తల్ రెవెన్యూ డివిజన్ వంటి అంశాల జోలికి పోకుండా గత ప్రభుత్వంపై విమర్శలకే ముఖ్యమంత్రి సమయం కేటాయించారని విమర్శించారు. సీపీఎం నాయకులు బల్‌రాం, గోపాల్, కాసప్ప పాల్గొన్నారు.

స్పోర్ట్స్ యూనివర్సిటీకి సీఎం అనుకూలం



విజేత జట్టుకు షీల్డ్ అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నట్లు దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కొత్తకోటలో వారం రోజులుగా కొనసాగిన కేపీఎల్ క్రికెట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. విజేతగా నిలిచిన శివ డిజిటల్స్ జట్టుకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి రూ.లక్ష, రెండో విజేత ఆర్ఆర్ఆర్ జట్టుకు రాహుల్ ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ ఇల్లూరి హరిన్‌రెడ్డి రూ.50 వేలు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. పట్టణంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. దీంతో పాటు ఇండోర్ స్టేడియం ఏర్పాటును సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.382 కోట్లు కేటాయించినట్లు ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ ఇల్లూరి హరిన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ పి.ప్రశాంత్, ఆరోగ్య వాకింగ్ క్లబ్ వ్యవస్థాపకుడు పి.శేఖర్‌గౌడ్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, మాజీ ఎంపీపీ గుంత మౌనిక, మాజీ జెడ్పీటీసీ డాక్టర్ పీజే బాబు, సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, బీచుపల్లి, అనిరుద్‌రెడ్డి, కేపీఎల్ నిర్వాహకులు నవీన్‌రెడ్డి, గుంత శివ, రఘు, బాలకృష్ణారెడ్డి, సాయి, సన్నీ, అరుణ్, మహేష్, తరుణ్, గణేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో వాటర్ ట్యాంక్ నిర్మాణం వద్దు

అమరచింత: పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో మిషన్ భగీరథ ద్వారా నిర్మించే నూతన వాటర్ ట్యాంకు స్థలంను కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కమిషనర్ రవిబాబుకు సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధుల నుంచి నిర్మించే ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకును హైస్కూల్ ఆవరణలో నిర్మించడం ద్వార విద్యార్థులకు ఆట స్థలం కరువవుతుందన్నారు. ఇతర ప్రభుత్వ స్థలంలో వాటర్ ట్యాంకు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, కుతుబ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి తరలిన శివస్వాములు



కాన్‌కుర్తి నుంచి బైక్‌యాత్రగా వెళ్తున్న శివస్వాములు

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి గ్రామానికి చెందిన శివస్వాములు శుక్రవారం స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడితో శ్రీశైలానికి బైక్ యాత్రగా తరలివెళ్లారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని జక్లేర్ గ్రామంలో శివస్వాములు ఇరుముడులు ధరించి శ్రీశైలానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శివస్వాములు తదితరులు పాల్గొన్నారు.

శివస్వాములకు పండ్లు పంపిణీ ..

నారాయణపేట రూరల్: పట్టణంలోని సింగార్‌బేస్ శివలింగేశ్వర దేవాలయ ట్రస్ట్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న శివస్వాములకు పండ్లు పంపిణీ చేశారు. ఉడుతా భక్తిగా స్వాములకు సేవ చేసుకునే భాగ్యం కలుగడం పూర్వజన్మ సుకృతమని ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గందె రవికాంత్, ఆవుటి రవికుమార్, మధుసూధన్‌రెడ్డి, అర్కంచి రవికుమార్, నాగేందర్, సోమిరెడ్డి పాల్గొన్నారు.

ప్రయాణికులకు తప్పని తిప్పలు

నారాయణపేట రూరల్: జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో వివిధ గ్రామాల నుంచి జన సమీకరణ కోసం ఆర్టీసీ బస్సులు ఉపయోగించారు. నారాయణపేట, కోస్గి, మహబూబ్ నగర్ డిపోలకు చెందిన బస్సుల్లో కాంగ్రెస్ నాయకులు ప్రజలను బహిరంగ సభకు తరలించారు. దీంతో శుక్రవారం ఉదయం నుంచి జిల్లాలో పలుచోట్ల బస్సు సర్వీసులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం నుంచి మక్తల్, కోస్గి, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే జనాలకు బస్సుల కొరతతో ఉన్న ఒకటి రెండు బస్సుల్లోనే గంటల తరబడి ఎదురు చూసి కిక్కిరిసి ప్రయాణం చేయాల్సి వచ్చిందని ప్రయాణికులు వాపోయారు. అదే విధంగా వివిధ గ్రామాల నుంచి పట్టణంలోని విద్యా సంస్థలకు వచ్చే విద్యార్థులకు బస్సులు రాక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. దీనికి తోడు సీఎం పర్యటన సమయంలో భీమండి కాలనీ నుంచి చిన్నజట్రం వరకు వాహనాలు అనుమతించ లేదు. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీంతో ఎండలో ఉక్కపోతకు గురైనట్లు పలు వాహనదారులు పేర్కొన్నారు. సభ ముగిసిన అనంతరం ఒకేసారి జనాలు రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్కు నియంత్రించడం పోలీసులకు సవాలుగా మారింది.